సాక్షి జయశంకర్ భూపాలపల్లి

బుధవారం | 30 | అక్టోబర్ | 2024



డ్యూటీ అదనం..సిబ్బంది బద్నాం

యాజమాన్యం వేధింపులతో టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. డబుల్ డ్యూటీలు చేసినా కనికరం చూపడం లేదని వాపోతున్నారు.

- 8లో▸



బెట్టింగ్ యాప్‌లతో నష్టపోయి..

బెట్టింగ్ యాప్‌ల కారణంగా నష్టపోయిన ఓ వ్యక్తి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగగా మారాడు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
37.3° /20.5°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రిపూట చలి తీవ్రత ఉండి, మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

చేతివృత్తులను ప్రభుత్వం ఆదుకోవాలి

చిట్యాల: సమాజంలో అంతరించిపోతున్న చేతివృత్తులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన శివశంకర్‌ను ఆయన కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా చెప్పుల షాపునే కులవృత్తినే నమ్ముకుని బతుకుతున్నాడని తెలిపారు. ఇంతవరకు ఆర్థికంగా స్థిరపడడం లేదన్నారు. జిల్లాలో అనేక మంది తన కులవృత్తినే నమ్ముకుని ఉన్నా కనీసం ఏ ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా జిల్లాలో కులవృత్తులను నమ్ముకుని జీవిస్తున్న వారికి ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.

వేతనాలు విడుదల చేయాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న అతిథి అధ్యాపకులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమ్మయ్య, కర్ణాకర్ కోరారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 1,654మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.42వేల వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో అధ్యాపకులు దేవేందర్, చిన్నయ్య, రాణి, యాకయ్య పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల నియామకం

భూపాలపల్లి రూరల్: సామాజిక ఆర్థిక సర్వే ప్రక్రియ పర్యవేక్షణకు జిల్లా నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా కమిటీ అధికారులుగా కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ బాబూరావు, ఆర్డీఓ మంగీలాల్, మండల ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. మండల ప్రత్యేకాధికారుల జిల్లాస్థాయి అధికారులను నియమించారు.

ఇద్దరికి నాన్‌బెయిల్ వారెంట్

భూపాలపల్లి అర్బన్: కోర్టుకు హాజరుకాని ఇద్దరు నిందితులకు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నాన్‌బెయిల్ వారెంట్ జైలు శిక్ష విధించినట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని దూదేకులపల్లి గ్రామానికి గుగులోతు వినోద్, పట్టణంలోని కారల్‌మార్క్స్‌కాలనీకి చెందిన జిముడ రాజేష్ వేర్వేరు కేసుల్లో కోర్టుకు హాజరుకావడం లేదని తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆటోడ్రైవర్‌కు జైలు

కాటారం: మద్యం సేవించి ఆటో నడిపిన డ్రైవర్‌కు రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ భూపాలపల్లి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ రాంచందర్‌రావు మంగళవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం మహాముత్తారం మండలం జీలపల్లికి చెందిన రాజు సోమవారం మద్యం తాగి ఆటో నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఎస్సై ఆధ్వర్యంలో మంగళవారం కోర్టులో హాజరుపరుచగా రాజుకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. కోర్టు తీర్పు ప్రకారం రాజును పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ఈఎస్‌ఎస్ యూనిట్లు గ్రౌండింగ్ చేయాలి

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు ఎకనామికల్ సపోర్ట్ స్కీం ద్వారా ఎంపికైన యూనిట్లను వెంటనే బ్యాంక్ అధికారులు గ్రౌండింగ్ చేయాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో బ్యాంక్ అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో పీఓ మంగళవారం సమీక్షించారు. ఈఎస్‌ఎస్ 2021–22 సంవత్సరంలో అర్హులైన గిరిజనులకు యూనిట్లు ఇవ్వడంలో చేస్తున్న జాప్యంపై ఆరా తీశారు. ట్రెజరీ నుంచి నిధులు మంజూరు అయినప్పటికీ బ్యాంక్ అధికారులు లబ్ధిదారుడికి రుణాన్ని ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలను సైతం బ్యాంక్ అధికారులు నిలిపివేయడం సరికాదని మండిపడ్డారు. అదే విధంగా వచ్చే గురువారం వరకు గ్రౌండ్ కాని యూనిట్లను గ్రౌండింగ్ చేయాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గిరిజనులను, లబ్ధిదారులను ఇబ్బంది పెట్టొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ బ్యాంక్ రీజినల్ మేనేజర్ చైతన్య కుమార్, ఎస్‌బీఐ మేనేజర్ రహీం, ఎస్‌ఓ సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా కొనుగోలు

నాణ్యమైన పత్తికి మద్దతు ధర

- దీపావళి తర్వాత సీసీఐ కొనుగోళ్లు ప్రారంభం
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో జిల్లా మార్కెటింగ్ అధికారి పి.కనకశేఖర్

భూపాలపల్లి రూరల్: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తెల్ల బంగారాన్ని కొనుగోలు చేసేలా కార్యాచరణ రూపొందించామని, నిబంధనల మేరకు పత్తి నాణ్యత ఉండాలని జిల్లా మార్కెటింగ్ అధికారి (డీఎంఓ) కనకశేఖర్ అన్నారు. పత్తి కొనుగోళ్లకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సిద్ధంగా ఉందన్నారు. దీపావళి తర్వాత కొనుగోళ్లు ప్రారంభిస్తున్న నేపథ్యంలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు, మద్దతు ధరపై అవగాహన, ఇతర సమస్యల పరిష్కారానికి మంగళవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లావ్యాప్తంగా రైతులు డీఎంఓకు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ప్రశ్న: సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ప్రారంభిస్తారు.

– బుర్రి రమేష్‌గౌడ్, ధన్వాడ, కాటారం

డీఎంఓ: దీపావళి పండుగ తర్వాత సీసీఐ కొనుగోళ్లు రెండు మిల్లుల్లో ప్రారంభమవుతాయి. రైతులు బయట దళారులకు అమ్మి నష్టపోవద్దు. సీసీఐ కేంద్రాల్లోనే నాణ్యమైన ధర లభిస్తుంది.

ప్రశ్న: తేమ పేరుతో ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. తేమ శాతం ఎంత ఉండాలి.

– మూత ఐలయ్య, రామకృష్ణాపూర్, టేకుమట్ల

డీఎంఓ: మాయిశ్చర్ 8నుంచి 12శాతం వరకు ఉంటే మద్దతు ధర లభిస్తుంది. 8శాతం తేమ ఉంటే క్వింటాల్‌కు రూ.7,521 ధర చెల్లిస్తారు. 9శాతానికి రూ.7,453, 10శాతం రూ.7,370, 11శాతం రూ.7,215, 12శాతానికి రూ.7,220 చెల్లిస్తారు. 12శాతానికంటే ఎక్కువగా ఉంటే సీసీఐలో కొనుగోలు చేయరు.

ప్రశ్న: తూకంలో మోసాలు చేస్తున్నారు. అరికట్టడం ఎలా?

– ఆకుల రవీందర్, చిట్యాల

డీఎంఓ: లీగల్ మెట్రాలజీ అధికారులు నిత్యం పరిశీలన చేస్తున్నారు. సీసీఐ కొనుగోలు ప్రారంభించే సమయంలో ప్రతీ రోజు ఇద్దరు రైతుల సమక్షంలో కూడా పరిశీలన చేస్తారు. దీంతో నిబంధనల మేరకు తేమశాతం వారి తూకం ఇతరత్రా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పత్తిలో తేమను ఎలా నిర్ధారిస్తారు?

– గుగులోతు సంతోష్‌నాయక్, గొల్లబుద్దారం, భూపాలపల్లి

డీఎంఓ: మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తి వాహనంలో మూడు ప్రాంతాల్లో తేమను పరిశీలించి సగటును నిర్దేశిస్తారు. వాహనం తూకమైన తర్వాత జిన్నింగ్ వీఓఎంతో పాటు అధికారులు తేమ శాతాన్ని పరిశీలిస్తారు. మార్కెట్ లేదా జిన్నింగ్‌లో వచ్చిన తేమ శాతంలో ఏది తక్కువ ఉంటుందో దాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు.

ప్రశ్న: ప్రైవేట్ మిల్లుల వారు తక్కువ ధరకు కొంటూ.. రైతులను మోసం చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి.

– గద్దం కిరణ్‌కుమార్, టేకుమట్ల

డీఎంఓ: రెండు, మూడు రోజుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయి. రైతులు సీసీఐ కేంద్రాల్లోనే అమ్ముకోవాలి. ప్రైవేట్ కొనుగోలుదారులపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో యువకులు, రైతులు ప్రైవేట్ వ్యాపారులు గ్రామాల్లోకి వస్తే సమాచారం ఇచ్చి సహకరించాలి.

ప్రశ్న: కౌలు రైతులు పంటలను ఎలా విక్రయించుకోవాలి?

– కర్నాటకపు సమ్మయ్య, రైతు స్వరాజ్య వేదిక నాయకులు (కొత్తపల్లి ఎస్‌ఎం)

డీఎంఓ: పట్టాదారు రైతును తీసుకొచ్చి పంటను అమ్మాలి. పట్టదారు రాని పరిస్థితిలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిని తీసుకురావాలి. ఐరిస్ తీసుకున్న తదుపరి పట్టాదారుకు ఓటీపీ వస్తుంది. ఆ నంబర్ చెబితే కొనుగోలుకు అనుమతి ఉంటుంది. సీసీఐ నిబంధనల ప్రకారం ఆధార్ నంబరు తప్పనిసరి. రైతు వేలిముద్రలు, ఓటీపీ ఒక్కో రైతు నుంచి ఎకరానికి 12 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తాం.



కనకశేఖర్



ప్రశ్న: వరంగల్ మార్కెట్‌లో పత్తికి క్వింటాల్‌కు ధర రూ.6,850 పలుకుతుంది. చిట్యాలలో మాత్రం రూ.6,000 ఉంది ఎందుకలా?

– కందుల రఘు, సుబ్బక్కపల్లి, టేకుమట్ల

డీఎంఓ: పత్తిని ఆరబెట్టుకొని దీపావళి తర్వాత సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లండి. నాణ్యమైన పత్తికి మద్దతు ధర వస్తుంది. అమ్మిన మూడు రోజుల్లో నగదు రైతు ఖాతాల్లో జమ అవుతుంది.

ప్రశ్న: పురుగు అధికంగా ఉంది. నివారణ చర్యలు తెలుపండి.

– విజయ్‌కుమార్, కొత్తపల్లిగోరి

డీఎంఓ: పురుగు నివారణ చర్యల కోసం వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి నివారణ చర్యలు చేపట్టాలి. నాణ్యత లేకుంటే పత్తిని కొనే అవకాశం లేదు.

ప్రశ్న: తూనికల్లో మోసాలను అరికట్టాలి.

– బుర్రి మురళి, చిట్యాల

డీఎంఓ: మిల్లుల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు తూకాలు, కొలతల అధికారులు తనిఖీలు నిర్వహిస్తారు. తూకాల్లో తేడా ఉన్నట్లు అనుమానం వస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలి.

ప్రశ్న: ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారు?

– మార్క శరత్‌బాబు, వెంచరామి, చిట్యాల

డీఎంఓ: నవంబర్ మొదటివారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ వస్తుంది. ధాన్యం అమ్మిన మూడు రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

కార్తీకమాసంలో ప్రత్యేక కార్యక్రమాలు

నెల రోజులు నిర్వహించడానికి ఏర్పాట్లు

కాళేశ్వరం: కార్తీకమాసం సందర్భంగా కాళేశ్వరం దేవస్థానంలో నవంబర్ 2నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నెల రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఈఓ మారుతి మంగళవారం తెలిపారు. ప్రతీ రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి దేవాలయంలో సామూహిక దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మట్టి ప్రమిదలు, వత్తులు, నూనె దేవస్థానం నుంచి ఉచితంగా ఇవ్వబడుతుంది. కార్తీక మాసంలోని సోమవారం 4న, 11న, 18న, 25న, కార్తీక పౌర్ణమి 15న రోజున సాయంత్రం ఆరు గంటలకు నుంచి దేవస్థానంలో సామూహిక సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులకు మట్టి ప్రమిదలు, వత్తులు, నూనెతో పాటు దేవస్థానం నుంచి ప్రసాదంగా పసుపు, కుంకుమ, గాజులు ఉచితంగా ఇవ్వబడుతుంది. కార్తీక మాసంలో నెల రోజులపాటు ప్రతీ రోజు సాయంత్రం 6.30 గంటలకు ఆకాశదీపం వెలిగించనున్నారు. కార్తీక మాసం సోమవారంతో పాటు పంచ రత్నాలలో 12న నుంచి 15వరకు సాయంత్రం 4.30 గంటలకు దేవాలయం నుంచి మంగళ వాయిద్యాలతో గోదావరి వద్దకు వెళ్లి నది హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న వైకుంఠ చతుర్దశి సందర్భంగా రాత్రి 8.00 గంటల నుంచి భజన, ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు. రాత్రి 11 గంటలకు స్వామివార్లకు క్షీరాభిషేకం, లింగోద్భవ పూజ నిర్వహిస్తారు.

15న కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం నాలుగు గంటల నుంచి దేవాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, రాత్రి 7గంటలకు జ్వాలా తోరణం నిర్వహించనున్నారు. కార్తీక మాసంలో సమయానుకూలంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఈఓ పేర్కొన్నారు.



గర్భగుడిలో పూజలు చేస్తున్న భక్తులు

రీజినల్ స్థాయి క్రీడాపోటీల ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: సింగరేణి వర్క్ పీపుల్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీజినల్ స్థాయి హాకీ క్రీడాపోటీలను మంగళవారం భూపాలపల్లి ఏరియాలో నిర్వహించారు. ఏరియాలోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో భూపాలపల్లి, రామగుండం–3 ఏరియాల క్రీడాకారులకు నిర్వహించిన క్రీడాపోటీలను ఏరియా సివిల్ డీజీఎం రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రీజినల్ స్థాయి పోటీల్లో రామగుండం–3 ఏరియా జట్టు భూపాలపల్లి జట్టుపై విజయం సాధించి సింగరేణి కంపెనీ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, క్రీడాకారులు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, తిరుమల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పరిచయం చేసుకుంటున్న డీజీఎం

రాష్ట్రస్థాయికి విద్యార్థులు ఎంపిక

టేకుమట్ల: మండలకేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అండర్–19 సైక్లింగ్ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి చిదిరాల సుధాకర్ మంగళవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్‌లో జిల్లా స్థాయి అండర్ 19 సైక్లింగ్ పోటీలలో నలుగురు విద్యార్థులు కందికట్ల వైష్ణవి, వి.హాసిని, ఎ.చర్మిష్మా, ఇ.అంజలి తమ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆనంద్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పకడ్బందీగా శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి అర్బన్: సామాజిక, ఆర్థిక సర్వే ప్రక్రియలో సమగ్రంగా ఇంటింటి సర్వేను నిర్వహించడానికి ఎన్యుమరేటర్లకు పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సూపర్‌వైజర్లు, నోడల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్వే నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు శిక్షణ పొంది నిష్ణాతులు కావాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా కుటుంబాల సమగ్ర సమాచార సేకరణ చేపట్టాలని సూచించారు. ప్రతీ కుటుంబం సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులాల వారీగా సర్వేలో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. సర్వే నిర్వహణలో మండల ప్రత్యేకాధికారి మండల నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. గ్రామంలోని 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ఇంటి నంబరు ఆధారంగా సర్వే ఉంటుందని, శివారు గ్రామాలు ఉంటే ప్రత్యేకంగా నంబరు కేటాయించాలని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. నవంబర్ 6వ తేదీ నుంచి సర్వే మొదలవుతుందన్నారు. 2వ తేదీన మండలాల వారీగా ఎన్యుమరేటర్లకు శిక్షణ ఏర్పాటు చేయాలని, 3, 4వ తేదీల్లో గ్రామపంచాయతీ, మున్సిపల్ రిజిస్టర్ల ప్రకారం ఇళ్ల జాబితా తయారు చేయాలని తెలిపారు. నమోదులో జిల్లా కోడ్, మండల కోడ్, ఎన్యుమరేషన్ నంబర్లు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఎన్యుమరేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని సబ్ కలెక్టర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ, సీపీఓ, ఆర్డీఓలతో కలిసి కోర్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓలు ప్రతీ రోజు సాయంత్రం ఆరు గంటలకు రిపోర్టు ఇవ్వాలని సూచించారు. సర్వే అనంతరం వివరాలను డేటా ఎంట్రీ చేసేందుకు ఆపరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించాలని (ఇంటి నంబరు, ఇంటి యజమాని పేరు వంటి వివరాలు) ఫారంలో నమోదు చేయాలని సూచించారు. సర్వే పూర్తయిన తదుపరి వివరాలు నింపిన స్టిక్కర్‌ను ఇంటి గోడపై అతికించాలన్నారు. సర్వే నిర్వహణ ఎన్యుమరేటర్లు మార్గదర్శకాలను అనుసరించి సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఓ నారాయణరావు, సీపీఓ బాబూరావు, సంక్షేమ అధికారి చిన్నయ్య, ఆర్డీఓ మంగీలాల్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. జిల్లా అధికారులతో మంగళవారం హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్‌శర్మ పాల్గొన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు తయారు చేసిన ప్రణాళిక, సర్వే ఉద్దేశం, జిల్లాస్థాయిలో కలెక్టర్‌లు తీసుకోవాల్సిన అంశాల గురించి డిప్యూటీ సీఎం వివరించారు.

ఆయుర్వేద వైద్యం ప్రఖ్యాతిగాంచింది

కాటారం: ఆయుర్వేద వైద్యం చాలా ప్రఖ్యాతిగాంచినదని ఆయుర్వేదిక్ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ తనూజారాణి అన్నారు. ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో మంగళవారం ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కళాశాలలో ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యతను వివరించారు. వైద్య విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ జగదీశ్, ఫార్మసిస్టు సునీత, సుమన్, ఎస్‌ఎస్‌ఓ జార్జ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బాలు, వైస్ ప్రిన్సిపాల్‌లు రాజేందర్, మాధవి, సిబ్బంది వెంకటయ్య, బలరాం, మహేందర్, ప్రీతి పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న వైద్యులు, ఉపాధ్యాయులు

కార్డులెప్పుడు?

ఫ్యామిలీ డిజిటల్ రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపు

- పెండింగ్‌లో 72,104 దరఖాస్తులు
- ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు పైలెట్ ప్రాంతాల్లో ముగిసిన సర్వే
- మిగతా ప్రాంతాల్లో మొదలు కాని వివరాల సేకరణ
- ఎప్పుడు చేస్తారో కూడా చెప్పలేని పరిస్థితి..

సాక్షి ప్రతినిధి, వరంగల్: కొత్త రేషన్‌కార్డులతో 'ప'రేషన్' తప్పుతుందని భావించిన ఆశావహులకు ఎదురుచూపులు తప్పడం లేదు. పైలట్ ప్రాజెక్టు కింద సర్వే చేసేందుకు ఉమ్మడి వరంగల్‌లోని ఒక అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక మండలంలోని ఓ గ్రామం, ఓ మున్సిపాలిటీ వార్డును ఎంపిక చేశారు. ఈ నెల 3 నుంచి 7 వరకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారులు బృందాలుగా సర్వే పూర్తి చేశారు. ఆ తర్వాత మూడు నెలల వ్యవధిలో కొత్త కార్డులు జారీ చేసేందుకు వీలుగా అన్ని ప్రాంతాల్లో సర్వే ప్రక్రియ ముగించనున్నట్లు ప్రకటించారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే ముగించిన అధికారులు.. మిగతా గ్రామాల్లో ఎప్పటి నుంచి చేయనున్నారో ఇంకా షెడ్యూల్ ఇవ్వలేదు. దీంతో ఈ ప్రక్రియ ఎప్పుడు ముగుస్తుంది? డిజిటల్ రూపంలో కొత్త కార్డులు ఎప్పుడు అందుతాయి? అన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కుటుంబాల సర్వే పూర్తి చేసి త్వరలోనే కార్డులు అందజేసే ప్రక్రియ జరుగుతున్నదని అధికారులు చెబుతున్నారు.

కొత్త రేషన్ కార్డులకు ఎదురుచూపులు..

ఉమ్మడి వరంగల్‌లో కొత్త కార్డుల కోసం సుమారు 72,104 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు రెండు నెలల కిందట అధికారులు ప్రకటించారు. పౌరసరఫరాల సంస్థ గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 11,05,543 కార్డుల ద్వారా 32,55,776 మంది కుటుంబసభ్యులు 33,153.976 మె.టన్నుల రేషన్ బియ్యం ప్రతీనెల పొందుతున్నారు. సుమారు ఐదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేయకపోగా.. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించి కూడా కొత్తగా ఎవరికీ ఇవ్వలేదు. 'ప్రజాపాలన' కార్యక్రమంలో తెల్ల కాగితాలపై దరఖాస్తులు ఆహ్వానించినా పరిష్కరించలేదు. కొత్త రేషన్‌కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసి, సర్వేతోపాటు ఫ్యామిలీ డిజిటల్‌కార్డుల జారీకి ఆదేశాలిచ్చింది. ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం.. ఆ తర్వాత కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ జరగాలని సూచించినా ఆ ప్రక్రియ ముందుకు జరగడం లేదు.



పరకాల మున్సిపాలిటీ రెండో డివిజన్‌లో సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో మొత్తం కార్డులు :	11,05,543 (ఆహారభద్రత+అంత్యోదయ+అన్నపూర్ణ)
మొత్తం యూనిట్లు (కుటుంబసభ్యులు) :	32,55,776
మండల స్థాయి స్టాక్ పాయింట్లు :	18
మొత్తం రేషన్ దుకాణాలు:	2,364
ప్రతీనెల రేషన్ బియ్యం పంపిణీ :	33,153.976 మె.టన్నులు

వివరాలు తీసుకున్నరు.. ఇంకా ఏమి చెప్పలే



అధికారులు మా గ్రామంలో కూడా ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. డిజిటల్ సర్వేలో కుటుంబ సభ్యుల సంఖ్య, వివరాలను సేకరించడంతోపాటు మా గ్రూప్ ఫొటో తీసుకున్నారు. కుటుంబంలో కుమారులకు పెళ్లి అయినట్లయితే వేరుగా వివరాలను నమోదు చేశారు. ఆధార్ కార్డుల నంబర్, పుట్టిన తేదీ వివరాలు అడిగారు. రేషన్ కార్డు ఉందా లేదా అని కనుక్కొని వెళ్లారు. ఇంకా ఏమీ చెప్పలేదు.

– కుమ్మిత లలిత, పొట్లాపూర్

డబ్బులు తిరిగి ఇవ్వండి

కాళేశ్వరం: దళితబంధు పేరిట అమాయక ప్రజల వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన మాజీ ప్రజాప్రతినిధులు తిరిగి డబ్బులు ఇవ్వాలని లేనిపక్షంలో ప్రజల చేతుల్లో శిక్ష తప్పదని మావోయిస్టుపార్టీ అధికార పార్టీ ప్రతినిధి జగన్ పేరిట మంగళవారం ఓ లేఖ వైరల్ అయింది. లేఖలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సంబంధించిన మండల, జిల్లాస్థాయి మాజీ ప్రజాప్రతినిధుల పేర్లు ఉండడంతో పోలీసులు ఆరా తీస్తున్నారు. మహాముత్తారంలో రాజిరెడ్డి, రాము, కిష్టయ్య, సడువలి, ఆర్.సడువలి, దుర్గయ్య, కాటారంలో జనార్దన్, రాకేష్, రాజు, మహదేవపూర్‌లో శ్రీనివాసరావు, బాపు, పలిమెలలో తిరుపతి, మల్హర్‌లో రాఘవ, శ్రీనివాసరావు, భూపాలపల్లిలో హరిబాబు ప్రజల వద్ద తీసుకున్న లక్షల రూపాయలు తిరిగి ఇవ్వకపోతే శిక్ష తప్పదని లేఖలో హెచ్చరించారు. దీంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై మహదేవపూర్ సీఐ రామచంద్రారావును సంప్రదించగా.. లేఖ నిజమా.. నకిలీనా అనే కోణంలో ఆరా తీస్తున్నట్లు తెలిపారు.

అవగాహన కోసమే ఓపెన్‌హౌస్

ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి అర్బన్: విద్యార్థులకు పోలీసుల విధుల పట్ల అవగాహన కల్పించడానికే ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ (ఫ్లాగ్ డే) వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్పీ కిరణ్‌ఖరే హాజరై ఓపెన్ హౌస్ కార్యక్రమం ప్రారంభించారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుధాలు ఉపయోగించే విధానంపై ఎస్పీ స్వయంగా పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసుల విధుల గురించి అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని చెప్పారు. సైబర్ నేరాల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్) బోనాల కిషన్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నగేష్, కిరణ్, రత్నం, శ్రీకాంత్, ఆర్‌ఎస్‌ఐలు, జిల్లా పరిధిలోని ఎస్సైలు పాల్గొన్నారు.



పోలీస్ ఆయుధాల గురించి వివరిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

క్లుప్తంగా

అసోసియేట్ ప్రొఫెసర్ ఇస్తారికి పేటెంట్ హక్కు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడాల ఇస్తారికి భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం 'ప్రతి అనులేఖనాన్ని నిరోధించడంలో ఎక్లీప్టా ఆల్బా మొక్కల పాత్ర' అనే అంశంపై పేటెంట్ హక్కు జారీ చేసింది. ఇస్తారి పర్యవేక్షణలో గతంలో డాక్టర్ లూనావత్ వెంకన్న పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఈ పరిశోధన ఫలితాలను 2022 అక్టోబర్‌లో ఇస్తారి పేటెంట్ హక్కుల కోసం భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయానికి దరఖాస్తు చేశారు. 2023లో దరఖాస్తులో పొందుపరిచిన వివరాలను పరిశీలించిన అనంతరం మంగళవారం భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం నుంచి ఈ పరిశోధనపై పేటెంట్ హక్కు పొందేందుకు అనుమతి ఇస్తున్నట్లు ఈ-మెయిల్ వచ్చింది. ఈ పేటెంట్ హక్కు 20 సంవత్సరాల వరకు ఉంటుందని సర్టిఫికెట్‌పై పొందుపరిచారు. ఈ సందర్భంగా ఇస్తారి, వెంకన్నను కేయూ వీసీ ప్రతాప్ రెడ్డి తన చాంబర్‌లో పేటెంట్ సర్టిఫికెట్ అందజేస్తూ అభినందించారు. అకడమిక్ పరంగా పని చేసే వారిని యూనివర్సిటీ ఎప్పుడూ ప్రోత్సాహం ఇస్తుందన్నారు. కాగా, ఇస్తారి పర్యవేక్షణలో ఇప్పటి వరకు 12 మంది పీహెచ్‌డీ పూర్తిచేశారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డితో సహా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.



డ్యూటీ అదనం.. సిబ్బంది బద్నాం



పనిభారం మోపుతున్న ఆర్టీసీ యాజమాన్యం

- అదనపు డ్యూటీలు చేసినా గైరాజరు వేస్తూ..
- మస్టర్ లేక జీతంలో కోత
- బస్సుల నిర్వహణలోనూ అసమర్థత
- ముందు చక్రాలకు రీ ట్రేడింగ్ టైర్లు
- ప్రమాదపుటంచున ప్రయాణం..
- అన్ని విధాలా కుంగిపోతున్న ఉద్యోగులు

హన్మకొండ: యాజమాన్యం వేధింపులతో టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. డబుల్ డ్యూటీలు చేసినా కనికరం చూపడం లేదని వాపోతున్నారు. విధులు నిర్వహించినా గైరాజరు వేస్తున్నారని వాపోతున్నారు. మస్టర్ లేక జీతంలో కోత పెడుతున్నారని టీజీఎస్ ఆర్టీసీ వరంగల్-2 డిపో కార్మికులు మొత్తుకుంటున్నారు. దసరా సీజన్‌లో వరుస డ్యూటీలు చేసినా గైరాజరు వేసినట్లు డ్రైవర్, కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్-2 డిపో అధికారుల వేధింపులు భరించలేకపోతున్నామని, తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగం చేయాల్సి వస్తోందని, డ్యూటీ చేసినా అబ్‌సెంట్ వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణ లోపం..

బస్సుల నిర్వహణలోనూ అసమర్థత నెలకొంది. ఆర్టీసీ బస్సులు ప్రమాదపుటంచున ప్రయాణాలు సాగిస్తున్నాయి. ఏ వాహనానికైనా ముందు టైర్ నాణ్యతతో ఉంటుంది. టూ వీలర్ నుంచి మొదలుకుని భారీ వాహనాల వరకు ముందు చక్రాలు కండీషన్‌లో ఉండేలా చూసుకుంటారు. కానీ.. టీజీఎస్ ఆర్టీసీ మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తోంది. సాధారణంగా బస్సులో 50 మందికి పైగా ప్రయాణించాలి. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ప్రస్తుతం ఒక్కో బస్సులో 100 మంది వరకు ప్రయాణిస్తున్నారు. వీరిని క్షేమంగా గమ్యస్థానానికి చేర్చాలి. అయితే ఆర్టీసీ యాజమాన్యం వీరి ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ముందు చక్రాలకు రీట్రేడింగ్ టైర్‌లు వాడుతుండడంతో అవి ఎప్పుడు పేలుతాయో, ప్రమాదం ఎప్పుడు జరుగుతుందో తెలియని భయాందోళనల మధ్య డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ములుగు దారిలో గట్టమ్మ సమీపంలో ఇరుకు రోడ్డులో బస్సుకు వేసినా రీ ట్రేడింగ్ టైర్ పగిలి బస్సు అదుపుతప్పింది. బస్ డ్రైవర్ అప్రమత్తమై ఎలాంటి ప్రమాదం జరుగకుండా జాగ్రత్త పడ్డారు. అదే సమయంలో పక్క నుంచి ఇసుక లారీ వెళ్తున్నది. ఇసుక లారీని ఢీ కొట్టాల్సి ఉండగా లారీ డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం తప్పింది. మరోవైపు డ్రైవర్లకు విశ్రాంతి ఇవ్వకుండా డ్యూటీల మీద డ్యూటీలు వేస్తున్నట్లు పలువురు ఆవేదన చెందుతున్నారు. రెస్ట్ రూంలో విశ్రాంతి తీసుకుంటున్నా.. కంట్రోలర్లు వచ్చి బలవంతంగా తీసుకెళ్లి డ్యూటీలు వేస్తున్నారని డ్రైవర్లు వారి గోడును వెళ్లబోసుకున్నారు. తగిన విశ్రాంతి లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశముందని వారు పేర్కొంటున్నారు.

పని గంటలకు మంగళం!

ఓటీల్లోనూ దోపిడీకి పాల్పడుతూ యాజమాన్యం తమను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టాన్ని చేకూరుస్తోందని ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. రోజుకు 8గంటలు పనిచేయాల్సి ఉన్నా.. రోజుకు 12 గంటల చొప్పున వారం రోజులు డ్యూటీలు చేయిస్తున్నట్లు వాపోతున్నారు. కాగా యాజమాన్యం పోకడతో 50 ఏళ్లు దాటిన డ్రైవర్లు, కండక్టర్లు, మహిళా ఉద్యోగులు విపరీత ఆందోళనకు గురవుతున్నారు. కార్మిక చట్టం ప్రకారం వారానికి 48 గంటల పాటు మాత్రమే డ్యూటీ చేయాల్సి ఉండగా చట్టాలను ధిక్కరిస్తూ బలవంతంగా 72 గంటలు డ్యూటీ చేయిస్తున్నారని ఉద్యోగులు వివరించారు. వరంగల్ రీజియన్‌లోని అన్ని డిపోల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తమ గోడును యాజమాన్యం పట్టించుకోవడం లేదని, అధికారులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారి ఆగ్రహావేశాలు..

వరంగల్-2 డిపో మేనేజర్ వ్యవహారశైలి తమకు అంతుబట్టడం లేదని ఆ డిపో కార్మికులు వాపోతున్నారు. ఏదైనా సమస్య ఉందని పరిష్కారం కోసం వెళ్తే.. తమపై అరుస్తున్నారని.. తమ బాధను వినడం లేదని వాపోతున్నారు. అధికారిని కలిసేందుకు మర్యాదగా యూనిఫాంలో వెళ్తే డ్యూటీ వదిలి ఎందుకు వచ్చావని, యూనిఫాం లేకుండా వెళ్తే యూనిఫాం లేకుండా వస్తావా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడుతున్నారని పలువురు ఉద్యోగులు తమ బాధను వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తూ.. వారి బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత ఉన్న అధికారి తీరుతో తాము వేగలేక పోతున్నామని ఆర్టీసీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం

ఉద్యోగులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. ఉద్యోగులను ఎలాంటి వేధింపులకు గురి చేయడం లేదు. డ్రైవర్ల అంగీకారం మేరకే డబుల్ డ్యూటీలు వేస్తున్నాం. బలవంతంగా డబుల్ డ్యూటీలు వేస్తున్నామని చెప్పడం సరికాదు. యూనిఫాం వేసుకుని వస్తే డ్యూటీ వదిలి ఎందుకు తన వద్దకు వచ్చారని ఎప్పుడూ అనలేదు. డ్యూటీ చేసిన వారికి గైరాజర్ వేయలేదు. ఎవరికైనా పొరపాటున గైరాజర్ పడితే తనను సంప్రదించాలి. ఉద్యోగులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దు. నిర్భయంగా తనతో సమస్యలు చెప్పుకోవచ్చు.

– జ్యోత్స్న, వరంగల్-2 డిపో మేనేజర్

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఎంపికలు



స్విమ్మింగ్ పోటీల్లో తలపడుతున్న బాలురు

వరంగల్ స్పోర్ట్స్: పాఠశాల క్రీడల సమాఖ్య అండర్-14,17 బాలబాలికల ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి స్విమ్మింగ్, హనుమకొండ జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కబడ్డీ ఎంపికలు నిర్వహించగా, బాలసముద్రంలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఈత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రూ నాయక్ మాట్లాడుతూ స్విమ్మింగ్ పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 80 మంది బాలబాలికలు హాజరయ్యారని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నవంబర్ 2,3,4 తేదీల్లో హైదరాబాద్ బాచుపల్లిలోని జియాన్ స్పోర్ట్స్ అకాడమీలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే, కబడ్డీ ఎంపిక పోటీలకు జిల్లాలోని 14 మండలాల నుంచి 28 టీమ్‌లు హాజరైనట్లు వివరించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన జట్లకు నేడు (30వ తేదీ) ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పంపనున్నట్లు తెలిపారు. నవంబర్ 3వ తేదీన మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంచాల స్వామిచరణ్, డీఎస్‌ఏ కోచ్‌లు రాయబారపు నవీన్‌కుమార్, కొత్త ప్రశాంత్, ఒనపాకల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో క్రీడా ఎంపికలు విజయవంతం

- డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్



అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న కోచ్‌లు, పీడీలు

వరంగల్ స్పోర్ట్స్: జిల్లా క్రీడా ప్రాధికారిత సంస్థ కోచ్‌లు, డీఎస్‌ఏ సిబ్బంది, క్రీడా సంఘాల బాధ్యుల సమన్వయంతోనే నాలుగు రోజుల పాటు సాగిన క్రీడా ఎంపిక పోటీలు విజయవంతంగా ముగిశాయని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పాఠశాల క్రీడల సమాఖ్య అండర్-19 ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాలుగు రోజులు 41 క్రీడాంశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లోఉమ్మడి జిల్లా నుంచి 3వేలపై చిలుకు క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. కోచ్‌ల సహకారంతో పోటీలను పారదర్శకంగా నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా డీఎస్‌ఏ కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు అశోక్ కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు బరుపాటి గోపి, శ్రీనివాస్‌రెడ్డి, శీలం పార్థసారధి, ఫెన్సింగ్ సంఘం జిల్లా కార్యదర్శి దుబ్బ రాము, డీఎస్‌ఏ కోచ్‌లు నరేందర్, కందికొండ రాజు, ఒనపాకల శంకర్, బొడ్డు విష్ణువర్ధన్, దేవిక తదితరులు పాల్గొన్నారు.

వెడవెల్లి వెంకటరెడ్డి @100

- ఘనంగా మాజీ ఎమ్మెల్సీ శతవసంత పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ వెంకటరెడ్డి

కురవి: సీరోలు మండల కేంద్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్సీ వెడవెల్లి వెంకటరెడ్డి తన శత వసంత (100) పుట్టిన రోజు వేడుకలు మంగళవారం తన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్.. వెంకటరెడ్డికి కేక్ తినిపించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

SRI KAKATIYA
INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
(Approved by PCI, New Delhi, Affiliated to Kakatiya University)
Near Waddepally, Filterbed, Unikicherla Road, Hanumakonda, (TG)-506 370
Cell: 9246895795, 9246895797, Email :skipswarangal@gmail.com

NOTIFICATION B-CATEGORY ADMISSIONS B.PHARMACY & M.PHARMACY, 2024-2025

Course	Branch	Total Intake	Category "B" Seats	EAPCET Code/ PGECET Code
B.Pharmacy	B.Pharmacy	100	30	SKIH
M.Pharmacy	1. Pharmaceutics	15	04	SKIH1
	2. Pharmaceutical Analysis	15	04	SKIH1
	3. Industrial Pharmacy	15	04	SKIH1
	4. Regulatory Affairs	15	04	SKIH1

Applications are to be submitted on or before 01-11-2024. The admissions are made as per rules Govt. of Telangana & KU.
Sd/- Secretary & Correspondent



క్రీడలతో మానసికోల్లాసం

- ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా
- ఏటూరునాగారంలో జోనల్ క్రీడలు ప్రారంభం



మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) పీఓ చిత్రామిశ్రా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కొమురం భీం స్టేడియంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల గిరిజన విద్యార్థులకు జోనల్ స్థాయి క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడలను పీఓ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు రోజూ విద్యార్థులతో వ్యాయామం చేయించాలన్నారు. కార్యక్రమంలో డీడీ పోచం, డీటీడీఓ సైదాన్, ఏటీడీఓలు దేశిరాం, క్షేత్రయ్య, ఏసీఎంఓ రవీందర్, ఏఓ పరశురాములు, ఎస్‌ఓ రాజ్‌కుమార్, స్పోర్ట్స్ అధికారులు మోహన్‌నాయక్, శరత్, కొమ్మాలు, వజ్జనారాయణ, భాస్కర్, శ్యామలత, కిష్టు, ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, శ్రీనివాస్, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లతో నష్టపోయి.. దొంగగా మారి

- కమిషనరేట్ పరిధిలో 17 చోరీలకు పాల్పడిన దొంగ అరెస్ట్
- 334 గ్రాముల బంగారం, 1.640 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం: బెట్టింగ్ యాప్‌లతో నష్టపోయిన ఓ వ్యక్తి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగగా మారాడు. ఇందులో భాగంగా పగలు తాళం వేసిన ఇళ్ల పరిసరాల్లో రెక్కీ నిర్వహించి రాత్రి చోరీలకు పాల్పడుతున్నాడు. ఇలా కమిషనరేట్ పరిధిలో పలు చోట్ల చోరీలకు పాల్పడుతున్న దొంగను సీసీఎస్, కేయూ పోలీసులు సంయుక్తంగా మంగళవారం అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. నిందితుడి నుంచి సుమారు రూ.28.50 లక్షల విలువైన 334 గ్రాముల బంగారు, కిలో 640 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.13వేల నగదు, ఒక ద్విచక్రవాహనం, ఒక సెల్‌ఫోన్, చోరీలకు ఉపయోగించే వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ మే రకు కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన కొండపల్లి ధర్మరాజు ప్రస్తుతం హనుమకొండ పోస్టల్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. డిగ్రీ పూర్తి చేసిన అనంతరం కొంతకాల రాయపర్తి మండల కేంద్రంలో బిర్యానీ సెంటర్ నిర్వహించి నష్టపోయాడు. అనంతరం చదువుకుంటున్నానని చెప్పి హనుమకొండ పోస్టల్ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు దిగాడు. నష్టపోయిన డబ్బును తిరిగి పొందేందుకు వివిధ మార్గాల్లో వ్యక్తిగత రుణాలు తీసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొన్నాడు. ఇందులో మరింత నష్టపోయి తీసుకున్న రుణాలకు వాయిదాలు చెల్లించలేక పూర్తిగా అప్పులపాలయ్యాడు. దీంతో తన అప్పులు తీర్చడంతోపాటు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా పగలు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి ఆ ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నాడు. ఇలా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 17 చోరీలకు పాల్పడ్డాడు. ఈ చోరీలపై అప్రమత్తమైన పోలీసులు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసి అత్యాధునిక టెక్నాలజీతో నిందితుడుని గుర్తించడంతో పాటు అతడిపై నిఘా పెట్టారు. నిందితుడు తాను చోరీ చేసిన చోరీ సొత్తు విక్రయించేందుకు కేయూ వైపునకు వస్తున్నట్లు సమాచారం రావడంతో సీసీఎస్, కేయూ పోలీసులు సంయుక్తంగా కేయూ క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు తన నేరాలు అంగీకరించాడు. దీంతో అతడి నుంచి పోలీసులు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారని సీపీ తెలిపారు.

పింఛన్ తీసుకొని వస్తూ మృత్యుఒడికి..

- కారు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం
- కోమల్ల వద్ద ఘటన

రఘునాథపల్లి: పింఛన్ తీసుకొని వస్తున్న ఓ వృద్ధురాలిని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె దుర్మరణం చెందింది. ఈ ఘటన హనుమకొండ- హైదరాబాద్ జాతీయ రహదారిపై కోమల్ల వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోమల్ల శివారు చింతలగూడేనికి చెందిన కొడిపెల్లి లక్ష్మి (85) మంగళవారం గ్రామంలో పింఛన్ తీసుకుని గ్రామానికి చెందిన బండి భారతమ్మతో కలిసి ఇంటికి వస్తోంది. మార్గమధ్యలోని జాతీయ రహదారిని ఇరువురు దాటే క్రమంలో హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న కారు వారిని ఢీకొంది. దీంతో లక్ష్మి, భారతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మి మృతి చెందింది. భారతమ్మ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు కొడిపెల్లి నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ బానోత్ సునీల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు.

రాఘవాపూర్‌లో వ్యక్తి..



ఉప్పలయ్య మృతదేహం

స్టేషన్‌ఘన్‌పూర్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను కారు వెనుకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం మండలంలోని రాఘవాపూర్‌లో జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాసాని ఉప్పలయ్య(57) ఇదే గ్రామానికి చెందిన ఎండీ కమర్‌కు పాలేరుగా పని చేస్తున్నాడు. ఉప్పలయ్యతో పాటు ఇదే గ్రామానికి చెందిన గాదెపాక యాదగిరి జాతీయ రహదారిపై నడుచుకుంటూ కమర్ వ్యవసాయ భూమి వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి జనగామ వైపునకు వెళ్తున్న కారు వెనుక నుంచి వీరిని ఢీకొంది. ఈప్రమాదంలో ఉప్పలయ్య అక్కడికక్కడే మృతిచెందగా యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు వెంటనే ఉప్పలయ్య కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. యాదగిరిని 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. ఈ ఘటనపై ఉప్పలయ్య కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ సోమరాజు కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

వరంగల్ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజులు సెలవు ఉందని, ఈ సమయంలో యార్డుల్లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. 31వ తేదీ దీపావళి పండుగ(గురువారం), 1వ తేదీ అమావాస్య(శుక్రవారం), 2న వారాంతపు యార్డు బంద్(శనివారం), 3న వారాంతపు సెలవు(ఆదివారం) ఉన్న నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వ్యాపారులు, కార్మికులు, హమాలీలు సరుకులు తీసుకురావొద్దని కోరారు. మార్కెట్ 4వ తేదీ సోమవారం పునఃప్రారంభమతుందన్నారు.

రూ. 2 లక్షల లంచం ఇస్తేనే బిల్లు..

- గ్రామప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేశారని మాజీ సర్పంచ్ దంపతుల ఆరోపణ
- బిల్లు ఇవ్వడం లేదని జీపీ కార్యాలయం ఎదుట పురుగుల మందుతో ధర్నా



పురుగుల మందుతో ధర్నా నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ సునీత-రమేశ్ దంపతులు



కొడకండ్ల: అప్పు చేసి గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తే గ్రామ ప్రత్యేకాధికారి(ఎంపీడీఓ), పంచాయతీ కార్యదర్శి బిల్లు ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ కొడకండ్ల మండలం పెద్దబాయితండా మాజీ సర్పంచ్ వాంకుడోత్ సునీత-రమేశ్ దంపతులు మంగళవారం జీపీ ఎదుట పురుగుల మందుతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పు చేసి రెండేళ్ల క్రితం పెద్దబాయితండా గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించామన్నారు. అయితే బిల్లులు రాకపోవడంతో అప్పుకు వడ్డీ పెరిగి ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. నెల క్రితం భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లు మంజూరైందన్నారు. అయితే రూ.2 లక్షల లంచం ఇస్తేనే బిల్లుకు సంబంధించిన చెక్కు ఇస్తామని ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి చెబుతున్నారని ఆరోపించారు. బిల్లు రాక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తమకు చావేశరణ్యమని నిర్ణయించుకుని పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించామని తెలిపారు. బిల్లు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, రమేశ్ పురుగుల మందు తాగేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై చింత రాజు గ్రామానికి చేరుకుని మాజీ సర్పంచ్ దంపతులకు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

వివాదాస్పదంగా భవన నిర్మాణ స్థలం..

పెద్దబాయితండా జీపీ భవన నిర్మాణ స్థలం వివాదాస్పదంగా మారింది. గ్రామ శివారులో 157 సర్వే నంబర్‌లోని ఆరు గుంటల స్థలాన్ని పంచాయతీ కార్యదర్శి పేరిట పట్టా చేసి 186వ సర్వేనంబర్‌లో జీపీ భవన నిర్మాణాన్ని చేపట్టారని, ఫలితంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ నేపథ్యంలో బిల్లు నిలుపుదల చేసి నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు జూలై 23వ తేదీన ప్రజావాణిలో జనగామ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘటనపై విచారణ జరిపి నివేదికను పంపాలని డీపీఓ మండల పంచాయతీ అధికారిని ఆగస్టు 28న ఆదేశించారు. రిజిస్ట్రేషన్ చేసిన సర్వేనంబర్‌లోని కాకుండా వేరే స్థలంలో భవన నిర్మాణం చేసినట్లు గుర్తించిన ఎంపీఓ.. నివేదికను డీపీఓకు పంపారు. భవన నిర్మాణానికి ముందు భూమికి సంబంధించిన రికార్డులు పరిశీలించాల్సిన అధికారులు అవేమి పట్టించుకోకుండా నిర్మాణానికి సహకరించారనే ఆరోపణలున్నాయి. రిజిస్ట్రేషన్ చేసిన స్థలంలో కాకుండా వేరే చోట నిర్మించారని తేలడం వివాదాస్పదంగా మారింది.

ఆరోపణలు అవాస్తవం

బిల్లుకు సంబంధించిన చెక్కు ఇవ్వడానికి లంచం అడిగామని మాజీ సర్పంచ్ దంపతులు నాపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. గ్రామ పంచాయతీ భవన నిర్మాణం రిజిస్ట్రేషన్ చేసిన స్థలంలో కాకుండా వేరే చోట నిర్మించారు. దీనిపై స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేయగా వాస్తవమని తేలింది. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ భవనం నిర్మించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేస్తే ఉన్నతాధికారులకు తెలిపి బిల్లు చెల్లిస్తాం.

– నాగశేషాద్రిసూరి, గ్రామప్రత్యేకాధికారి

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి



ప్రభాస్(ఫైల్)

సంగెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన సంగెం మండలం ఆశాలపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జనగాం ప్రవీణ్‌కుమార్, జయశ్రీ దంపతులకు కూతురు ప్రణతి, కుమారుడు ప్రభాస్ (20) ఉన్నారు. ప్రవీణ్‌కుమార్ గీత వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రభాస్ బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 26వ తేదీన తన మిత్రుడు వరంగల్‌కు చెందిన బిల్లా నూర్‌దాస్‌తో కలిసి తన మేనత్త పెద్దగోని కవిత ఊరు ఎల్లగూర్‌రంగంపేటకు ద్విచక్రవాహనంపై వెళ్లారు. అదేరోజు సాయంత్రం తిరిగి వస్తున్న క్రమంలో సంగెంలోని కేజీబీవీ సమీపంలో ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి చెట్టుకు ఢీకొన్నారు. ఈ ఘటనలో ప్రభాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో 108లో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి ..



వెంకన్న మృతదేహం

దోర్నకల్: మండలంలోని చిలుకోడు శివారు మోడల్ స్కూల్ సమీపంలో ఓ వ్యక్తి ఎస్సారెస్పీ కాల్వలో పడి మృతి చెందాడు. చిలుకోడు గ్రామానికి చెందిన వద్దూరి వెంకన్న(47) మోడల్ స్కూల్‌లో నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తుండగా భార్య పద్మ అదే పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట కార్మికురాలిగా పని చేస్తోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి విధులు ముగించుకున్న వెంకన్న మంగళవారం బైక్‌పై ఇంటికి వస్తూ పాఠశాల సమీపంలో ఎస్సారెస్పీ కాల్వ మోరీపై కూర్చున్నాడు. ఆ సమయంలో అస్వస్థతకు గురికావడంతో మోరీ పైనుంచి కాల్వలో పడ్డాడు. దీనిని గమనించిన స్థానికులు వెంకన్నను బయటకు తీశారు. 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకునే సమయానికి వెంకన్న మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

House for sale 164 Sq.yards West Face Near Releif Hospital Arepally WGL 70 Lakhs. Cell: 9652715142. [W-1237347]

SERVICES

FINANCIAL SERVICES

బాలాజీ లోన్స్ తక్కువ వడ్డీకే చేయబడును. బిజినెస్, మార్టిగేజ్, హోమ్, టేకోవర్ లోన్స్, ప్లాట్ లోన్ ఇవ్వబడును. I.T. రిటర్న్స్, G.S.T, పాన్‌కార్డ్. కాకతీయ థియేటర్ దగ్గర, వరంగల్. 85228 25358. [M-1185413]

WANTED

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Q: 10th- డిగ్రీ, Sal: 20K-30K. మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [W-1239931]

ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి ఫుడ్ , జీ: 20K, Ph: 8977639662, 8977639663 [SCA24000512]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.